అభివృద్ధిలో అందరికీ భాగస్వామ్యం..!!

తలసరి విదేశీ ప్రత్యక్ష పెట్టుబడి, తలసరి స్థూల దేశీయోత్పత్తి, జీడీపీ వృద్ధిరేటు అనే మూడు చలాంకాల విషయంలో పట్టణ ప్రాంతాల మధ్య వైరుధ్యాలున్నాయి. సంతులిత, పరిపోషిత వికాసాభివృద్ధి చోటుచేసుకోవాలంటే Inclusive Growth (అన్ని వర్గాలను అభివృద్ధిలో భాగస్వాములను చేయడం) ముఖ్యం. అధిక వృద్ధిరేటు సాధనలో భాగంగా నిర్లక్ష్యానికి గురైన వర్గాల ఆదాయం, ఉపాధి పెరుగుదలకు ప్రయత్నించాలి.



భారత రాజ్యాంగం.. పట్టణాభివృద్ధి అనే అంశాన్ని సంబంధిత రాష్ట్రాల హక్కుగా అభిప్రాయపడింది. పట్టణాభివృద్ధికి సంబంధించి కేంద్ర ప్రభుత్వ పాత్ర సలహాలకు మాత్రమే పరిమితం. జాతీయ పట్టణ విధానం రూపొందించాల్సిన ఆవశ్యకత లేకపోవడాన్ని ఈ విషయం స్పష్టం చేస్తుంది. పట్టణాభివృద్ధి విషయంలో కేంద్ర బడ్జెట్ ప్రభావం పరోక్షంగా ఉంటుంది. దేశంలో పట్టణ ప్రాంతాల అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం 2005లో జవహర్‌లాల్ నెహ్రూ జాతీయ అర్బన్ రెన్యువల్ మిషన్ (JNNURM)ను ప్రవేశపెట్టింది. పట్టణ ప్రాంతాల్లో మౌలిక సౌకర్యాలు మెరుగుపరచడం ద్వారా స్థానిక సంస్థల పాత్రను పటిష్టం చేయాలనే ఉద్దేశంతో ఈ పథకాన్ని ప్రవేశ పెట్టారు. నగర జనాభా, పెట్టుబడి అవసరాలను దృష్టిలో ఉంచుకొని 63 నగరాలను ఎంపిక చేశారు. ఈ పథకానికి కేంద్ర ప్రభుత్వం బడ్జెట్ లో 2006-07లో 1.13 బిలియన్ డాలర్లను, 2007-08లో 1.23 బిలియన్ డాలర్లను కేటాయించింది. 11వ పంచవర్ష ప్రణాళిక మౌలిక సౌకర్యాలు, నీటి వనరుల అభివృద్ధికి 1.73 బిలియన్ డాలర్లు కేటాయించింది. ఈ పథకంతో పాటు రాజీవ్ గాంధీ తాగునీటి మిషన్ 2007-08లో 1.44 బిలియన్ డాలర్లు కేటాయించింది. రాష్ట్రాలు, నగరాల్లో పారిశుధ్య సౌకర్యాల మెరు గుదలకు కేంద్రం బడ్జెట్ ద్వారా ప్రత్యేక నిధులు కేటాయిస్తుంది. భౌతిక సౌకర్యాల అభివృద్ధి, విస్తర ణకు 'జాతీయ కనీస ఉమ్మడి కార్యక్రమం' ప్రాధాన్యమిస్తుంది. మురి కివాడల్లో నివసించేవారికి గృహవసతి కల్పించడానికి అవసరమైన సమగ్ర విధానాలను రూపొందించుకోవాల్సిన ఆవశ్యకతను ఈ కార్యక్రమం తెలుపు తుంది. మిలీనియం అభివృద్ధి లక్ష్యాల సాధనలో భాగంగా భారత ప్రభుత్వం పట్టణ రంగంలో పెట్టుబడులను ప్రోత్స హించడం, ప్రస్తుతం అమల్లో ఉన్న విధానాలను పటిష్టం చేయడం లాంటి చర్యలు తీసుకుంది. భారత పట్టణ వ్యవస్థ ప్రపంచంలోనే రెండో అతిపెద్ద వ్యవస్థగా రూపొందింది. భారత నగరాలు, పట్టణాలు దేశ స్థూల దేశీయోత్పత్తికి 50 శాతం వాటాను అందిస్తూ.. ఆర్థిక వృద్ధికి కేంద్రబిందువుగా రూపొందాయి. పట్టణాలు, నగరాల సామర్థ్యాన్ని పూర్తిగా వినియోగించుకొని ఆర్థికవృద్ధిలో ప్రధాన పాత్ర వహించే విధంగా వాటిని తీర్చిదిద్దాలంటే మౌలిక సౌకర్యా లను మెరుగుపరచ డంపై శ్రద్ధ వహించాలి.

దేశంలో ఇప్పటికీ 14.1 శాతం ప్రజలు మురికివాడల్లో నివసిస్తు న్నందువల్ల పట్టణ పేదలకు కనీస సేవలు అందించడ మనేది JNNURM లక్ష్యంగా ఉండాలి.12వ ఆర్థిక సంఘం సిఫారసు ప్రకారం పట్టణ స్థానిక సంస్థలకు కేటాయించే గ్రాంట్ల లో 50 శాతం Solid Waste Management పథకాలపై వ్యయం చేయాలి. ఈ ఉద్దేశం కోసం అవసరమైన నిధులను రాబట్టుకోగలవనే అభిప్రాయంతో ఢిల్లీ, ముంబయి, కోల్‌కతా, చెన్నై, బెంగళూరు, హైదరాబాద్ లాంటి 6 నగ రాలను ఈ నిబంధన నుంచి మినహాయించారు. 2005-10 మధ్యకా లంలో పట్టణ అభివృద్ధి, పేదరిక నిర్మూలన మంత్రిత్వశాఖ అంచనా ప్రకారం మౌలిక సౌకర్యాల కల్పనకు రూ.76,896 కోట్ల లోటు (resource gap) ఉండగలదు. గ్రాంట్-ఇన్-ఎయిడ్ రూపంలో ఈ లోటును భర్తీ చేయవలసిందిగా మంత్రిత్వశాఖ ఆర్థిక సంఘాన్ని కోరింది. గ్రాంట్ల మంజూరుకు జనాభా, హెచ్చు తలసరి ఆదాయం నుంచి సంబంధిత నగరాల తలసరి ఆదాయానికి ఉన్న తేడా, సంబం ధిత నగర రెవెన్యూ రాబడి ప్రాతిపదికలుగా ఆర్థిక సంఘం సిఫార్సు చేసింది. అనేక నగరాల కు సంబంధించి అంచనా వేసిన జనాభా వృద్ధి ఒకేవిధంగా ఉన్నట్లు తెలుస్తుంది. ప్రస్తుత జనాభా, అంచనా వేసిన జనాభా వృద్ధిరేట్ల మధ్య తేడా ఉన్నందువల్ల ముఖ్య నగరాలైన ముంబయి, ఢిల్లీ, కోల్‌కతాలను ఈ లెక్కల నుంచి మినహాయించారు. మౌలిక సౌకర్యాల సమస్యలు,నగర అభివృద్ధి అన్ని పట్టణ ప్రాంతాల్లో ఒకేవిధంగా ఉంది.

నగరాల ప్రగతి - మూడు చలాంకాలు :

నగరాల ప్రగతిని పరిశీలించినప్పుడు ప్రధాన, చిన్న నగరాల మధ్య తలసరి విదేశీ ప్రత్యక్ష పెట్టుబడి, తలసరి స్థూల దేశీయోత్పత్తి, స్థూల దేశీయోత్పత్తి వృద్ధిరేటు అనే మూడు చలాంకాల విషయంలో హెచ్చు తేడాలు కనిపిస్తున్నాయి. మరో ముఖ్య చలాంకమైన పేదరిక నిష్పత్తి విషయంలో మధ్య, చిన్న పట్టణ ప్రాంతాలతో పోల్చినప్పుడు ప్రధాన నగరాల్లో పేదరికం ఎక్కువగా ఉంది. 'నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్

పబ్లిక్ ఫైనాన్స్ అండ్ పాలసీ' అంచనా ప్రకారం మన దేశంలోని 5 ముఖ్య నగరాలు జాతీయ స్థూల దేశీయోత్పత్తికి 15 శాతం వాటాను అందిస్తున్నాయి. ప్రస్తుతం భారతదేశ పట్టణ రంగం వాటా స్థూల దేశీయోత్పత్తిలో 50 నుంచి 60 శాతం వరకు ఉంది. 2011 నాటికి ఈ వాటా 65 శాతానికి చేరుకుంటుందని అంచనా. భారతదేశంలో గ్రామీణ ప్రాంతాల్లోని పేదరికం కన్నా, పట్టణ ప్రాంతాల్లో పేదరికం ఎక్కువగా ఉన్న నేపథ్యంలో ఆర్థికవృద్ధికి నగరాలు ఇంజిన్‌లాగా ఉపకరించగలవన్న భావన ప్రశ్నార్థకం కావచ్చు. రాష్ట్రాలను పరిశీలించినప్పుడు కొన్ని రాష్ట్రాలు మాత్రమే ఆర్థికవృద్ధికి హెచ్చు వాటాను అందిస్తున్నాయి. కొన్ని ప్రాంతాలు మాత్రమే దేశ ఆర్థికవృద్ధికి దోహదపడుతున్నాయి.

నగరాలు – మురికి వాడలు :

2005లో నాగపూర్‌లో సుమారు 40 శాతం జనాభా మురికివాడల్లో నివసిస్తుండగా, 50 శాతం జనాభా పేదరికంలో మగ్గుతున్నారు. పశ్చిమ బెంగాల్‌లో ముఖ్య పారిశ్రామిక ప్రాంతంగా భావించే అసన్‌సోల్‌లో ఎక్కువ జనాభా మురికి వాడల్లో నివసిస్తున్నారు. జార్ఖండ్ రాష్ట్రంలో 32.91 శాతం పట్టణ ప్రజలు పేదలు. తిరువనంతపురంలో 16.16 శాతం ప్రజలు పేదవర్గానికి చెందిన వారు. కాబట్టి ప్రాంతాల మధ్య సంతులిత, స్థిరిత వృద్ధి చోటు చేసుకోవాలంటే Inclusive Growth ముఖ్యపాత్ర వహిస్తుంది.

ముఖ్యమైన 8 నగరాలతో పాటు 11 నగరాలు ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, మౌలిక సౌకర్యాల మెరుగుదల, నాలెడ్జ్ పరిశ్రమలు, సంపద పెరుగుదల విషయంలో మంచి ప్రగతి సాధించాయని ఫిక్కీ (FICCI) అభిప్రాయపడింది. సూరత్, లూధియానా, చండీగఢ్, నాగపూర్, వడోదర, విశాఖపట్నం, జైపూర్, తిరువ నంతపురం, కోచి, నాసిక్, ఇండోర్‌లను అధిక వృద్ధి సాధించిన, మౌలిక సౌకర్యాల నాణ్యత పెంపొందించుకున్న నగరాలుగా ఫిక్కీ గుర్తించింది. ఢిల్లీ ఆదాయంలో ఎక్కువ భాగం వాణిజ్యం, కామర్స్, సేవల నుంచి లభిస్తుంది. ఈ నగరంలో ఉన్న 2.3 లక్షల రిటైల్ సంస్థలు 5.4 లక్షల మందికి ఉపాధి కల్పించాయి. ముంబయి లాంటి మెట్రోపాలిటన్ ప్రాంతంలో తయారీ రంగంలో ఉద్యోగిత 1990లలో తగ్గింది. ఇదే కాలంలో వాణిజ్యం, ఫైనాన్స్, సేవారంగంలో ఉద్యోగిత శాతం మొత్తం ఉద్యోగితలో 52.1 నుంచి 64.3కు పెరిగింది. దక్షిణాది నగరాలైన హైదరాబాద్, బెంగళూరు.. సాఫ్ట్‌వేర్ అండ్ సర్వీసెస్‌ను ప్రాధాన్యతా రంగంగా అభివృద్ధి పరచగా.. చెన్నై సేవలు, తయారీరంగ కేంద్రంగా నిలిచింది. ఈ విధంగా ప్రత్యేకీకరణ వల్ల ఉపాధి అవకాశాలు కూడా మెరుగవుతాయి.

Inclusive growth దృక్పథంలో భాగంగా రెండు రకాల వ్యూహాలను అవలంబించాలి. ఆర్థిక అవకాశాల ద్వారా స్థిరిత వృద్ధి, సమాన అవకాశాల ద్వారా సాంఘిక వృద్ధి చేకూరేలాగా ప్రయత్నించాలి. ప్రస్తుత ఎంపిక ప్రక్రియలు భవిష్యత్తులో ఎంతవరకు వృద్ధికి తోడ్పడతాయనే అంశాలను విశ్లేషించాలి. జాతీయ స్థాయిలో వివిధ ప్రాంతాల మధ్య సమతౌల్య అభివృద్ధిలో భాగంగా Inclusive growthను కేంద్ర ప్రభుత్వం పాటించగలిగే విధానంగా భావించాలి.

అబ్జెక్టివ్ క్వశ్చన్స్

- నెహ్రూ జాతీయ అర్బన్ రెన్యువల్ మిషన్ ప్రవేశపెట్టింది?
  – 2005లో
- మన దేశంలో స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ)లో 5 ముఖ్య నగరాల వాటా?
  – 15 శాతం
- భారతదేశంలో మురికి వాడల్లో నివసించే జనాభా?
  – 14.1 శాతం
- సంతులిత, స్థిరిత వృద్ధికి ప్రాంతాల మధ్య అవసరమైంది? – Inclusive Growth
- గ్రాంట్ల రూపేణా లభించిన మొత్తంలో నగరాలు Solid Waste Management పథకాలపై ఎంత వ్యయం చేయాలి?
  – 50%
- 2011 నాటికి దేశ స్థూల దేశీయోత్పత్తిలో పట్టణ రంగం వాటా ఎంత ఉంటుందని అంచనా?
  – 65 శాతం
- ప్రపంచ పట్టణ వ్యవస్థలో రెండో అతిపెద్ద దేశం?
  – ఇండియా